క్లుప్తంగా

మహానందిలో భక్తుల సందడి



క్యూలైన్‌లో ఉన్న భక్తులు

నంద్యాల(అర్బన్‌): శ్రావణ సోమవారం సందర్భంగా మహానంది క్షేత్రానికి భక్తులు తరలివచ్చారు. ముందుగా భక్తులు కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరస్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాధారణ దర్శనం, స్పర్శ దర్శనం, అభిషేకాలకు వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ అధికారులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మహానందీశుడికి పల్లకీ సేవ



స్వామి అమ్మవార్ల పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్‌): మహానందిలో వెలసిన శ్రీకామేశ్వరి, మహానందీశ్వరస్వామి వారికి సోమవారం సాయంత్రం పల్లకీ సేవను చేపట్టారు. టెంపుల్‌ ఇన్‌స్పెక్టర్‌ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు అనంతరం విశేషంగా అలంకరించిన పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య ప్రదక్షిణ చేపట్టారు.

చెవి కమ్మ అప్పగింత

నంద్యాల(అర్బన్‌): మహానందిలోని చిన్న కోనేరులో పుణ్యస్నానాలు చేస్తూ జారవిడుచుకున్న చెవి కమ్మను వెతికించి భక్తురాలికి అప్పగించారు. సోమవారం శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల దర్శనార్థం విజయనగరం జిల్లాకు చెందిన రమ్య దంపతులు వచ్చారు. కోనేరులో స్నానం చేస్తున్న సమయంలో చెవి కమ్మ జారి నీటితో పడింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డు బాలుడుకి విషయం తెలపగా వెంటనే స్థానిక చెంచు యువకులతో వెతికించి టెంపుల్‌ ఇన్‌స్పెక్టర్‌ మల్లికార్జున సమక్షంలో కమ్మను భక్తురాలికి అప్పగించారు.

గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

నంద్యాల(అర్బన్‌): గ్రామాల్లో అందరూ కలిసి ఉంటేనే ఆనందంగా ఉంటుందని, ప్రశాంతంగా జీవించాలని, పంతాలకు పోయి కుటుంబాలను నాశనం చేసుకోవద్దని నంద్యాల తాలూకా సీఐ శ్రీనివాసరెడ్డి అన్నారు. మహానంది మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన మసీదుపురం, సీతారామాపురం, గోపవరం గ్రామాల ప్రజలతో సోమవారం రాత్రి ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తేవాలని, పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు.

మోటార్లకు మరమ్మతులు చేయించాలి

జూపాడుబంగ్లా: ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి జూపాడుబంగ్లా -1, 2 ఎత్తిపోతల పథకాల మోటార్లు మరమ్మతులు చేయించి రైతులను ఆదుకోవాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు సోమవారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను కలిసి వినతి పత్రం అందజేశారు.

వినాయక చవితి ప్రశాంతంగా నిర్వహించుకోండి



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజి నాయక్‌

ఆత్మకూరురూరల్‌: వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ ఆర్‌ రామాంజి నాయక్‌ ప్రజలకు సూచించారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పలు గ్రామాల్లో పిల్లలు తాళ్లు రోడ్డుకు అడ్డంగా పెట్టి చందాలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలా చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశ మున్నందని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను అలా పంపొద్దని సూచించారు. పోలీసులు కూడా అంకితభావం విధులు నిర్వహించాలని సూచించారు. విజిబుల్‌ పోలీసింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులపై ప్రత్యేక శ్రద్ధవహించాలన్నారు. సమావేశంలో రూరల్‌ సీఐ సురేష్‌కుమార్‌ రెడ్డి, నందికొట్కూరు ఎస్‌ఐ చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

మాకే భద్రత లేకుంటే ఎలా?



కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టరుపై జరిగిన ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండాలంటే సెంట్రల్‌ ప్రొటెక్షన్‌ చట్టాన్ని అమలు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలి. మాకే భద్రత లేకుంటే రోగులకు మేమెలా వైద్య సేవలు అందించాలి. ఆస్పత్రుల్లో కూడా సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి.
– సి.శారద స్టాఫ్‌ నర్సు, ప్రభుత్వ వైద్యశాల నందికొట్కూరు



కఠినంగా శిక్షించాలి



ప్రాణాలు కాపాడే వైద్యులు, జన్మనిచ్చే మహిళలపై నానాటికి అఘాయిత్యాలు, అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయి. వాటి నుంచి మహిళలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కోల్‌కత్తా ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య మానవసమాజానికి మచ్చలాంటిది. నిందితులను కఠినంగా శిక్షించాలి. అలాంటి అఘాయిత్యాలు వైద్యులపై జరగకుండా ఆసుపత్రుల వద్ద రాత్రి వేళల్లో పోలీసుబందోబస్తు ఏర్పాటు చేయాలి. – డాక్టర్‌ యశశ్విని, పారుమంచాల, ప్రాథమిక వైద్యకేంద్రం

నేడు మండల సమావేశం

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎన్‌ఎస్‌ రెడ్డి సోమవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు హాజరుకానున్న ఈ సభకు మండల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో పాల్గొనాలన్నారు.



శ్రీపతిరావుపేటలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు



వెలుగోడు: కోలాటంలో చిన్నారులు



శ్రీశైలం: యాదవ సత్రంలో గోపూజ నిర్వహిస్తున్న సీఐ, సత్రం మేనేజర్‌, తదితరులు



శ్రీశైలం: గోకులాష్టమి వేడుకల్లో గోపికలు, శ్రీకృష్ణుల వేషధారులతో నిర్వాహకులు



తంగడంచలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొత్తపల్లిలో రాధాకృష్ణుల కళ్యాణం..

కృష్ణా..ముకుందా.. మురారీ!

- వాడవాడలా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు
- చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించిన చిన్నారులు
- ఊరేగింపులతో గ్రామాల్లో పండగ సందడి
- ఉత్సాహంగా ఉట్టి కొట్టిన యువకులు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శ్రీశైలం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. వాడవాడలా స్వామివారి చిత్రపటాల ఊరేగింపులతో సోమవారం పండగ వాతావరణం నెలకొంది. చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ఊరేగింపులో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. యాదవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగిపులో 'మేమే మేమే యాదవులం.. మాదే మాదే గొల్ల కులం' అంటూ యువత కదం తొక్కారు. మరోవైపు భజన పాటలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలతో ఊరేగింపు భక్తిశ్రద్ధలతో సాగగా.. సాయంత్రం యువకులు ఉత్సాహంగా ఉట్లు కొట్టారు. – ఆత్మకూరు



వెలుగోడు: ఉట్టి కొట్టేందుకు పోటీపడుతున్న చిన్నారులు



ఆత్మకూరులో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరిస్తున్న విద్యార్థులు





తిమ్మాపురంలో శ్రీకృష్ణుడికి అభిషేకం..

ఆత్మకూరుతోపాటు శ్రీపతిరావుపేట, వడ్లరామాపురం తదితర గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. వేకువజామునే యాదవసోదరులు శ్రీకృష్ణుడి చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలంకరించిన వాహనాలలో శ్రీకృష్ణుడి విగ్రహాలను కొలువుంచి ఊరేగింపు నిర్వహించారు. ఆత్మకూరులోని ప్రగతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో కరస్పాండెంట్‌ రాఘవ కృష్ణ మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జీవితం ఎంతో ఆదర్శనీయమైనదని, సర్వమానవాళికి ఎంతో తోడ్పాటునిచ్చిందని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల కోలాటం, నృత్య ప్రదర్శనలు, శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలు ఆకట్టుకున్నాయి. శ్రీపతిరావుపేట గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని సుద్దుల రచ్చబండ వద్ద శ్రీకృష్ణుని చిత్రపటానికి భక్తులు పూజలు నిర్వహించారు. గ్రామంలోని యాదవులంతా ఒక్కటిగా కలిసి శ్రీకృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

● వెలుగోడు: పట్టణంలోని సరస్వతి శిశు మందిరం పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు సెంటర్‌ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ముందు విద్యార్థుల కోలాటం, డంబుల్స్‌ ప్రదర్శన కృష్ణా, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అక్కడ ఉట్టి కొట్టే కార్యక్రమంతో వేడుకలు ముగించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సీతా లక్ష్మమ్మ, డీఎస్పీ రామాంజి నాయక్‌, ఎస్‌ఐ విష్ణు నారాయణ పాల్గొన్నారు.

● శ్రీశైలం యాదవ సత్రంలో..

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని శ్రీకష్ణ యాదవ నిత్యాన్నదాన సత్రంలో గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్రంలో నివసిస్తున్న చిన్నారులు గోపికలు, గోపాలుర వేషంలో భక్తులను అలరించారు. సీఐ ప్రసాద్‌రావు యాదవ్‌, సత్రం మేనేజర్‌ శివ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు. కాగా కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా ట్రాఫిక్‌ను నియంత్రణకు సీఐ చర్యలు తీసుకున్నారు. రద్దీ ప్రాంతాలు సాక్షి గణపతి, హాటకేశ్వరం, బస్టాండ్‌ ఏరియా, నంది మండపం తదితర ప్రదేశాల వద్ద హోంగార్డులను నియమించారు. పాతాళగంగా, దర్శన కౌంటర్లు, డొనేషన్‌ కౌంటర్‌, మొదలైన వాటి వద్ద అదనపు పోలీస్‌ సిబ్బందిని నియమించి భక్తులక ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు

● నంద్యాల(అర్బన్‌): మహానంది మండలంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉట్టికొట్టే కార్యక్రమాలు, చిన్నారుల వేషధారణలు, సాంస్కృతిక అలరించాయి. తిమ్మాపురం గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. యు.బొల్లవరంలో చిన్నారుల శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ ఆకట్టుకుంది.

గోకుల కృష్ణా..గోపాల కృష్ణా!



మిడుతూరులో పూజలు అందుకున్న శ్రీకృష్ణుడు

గోకులాష్టమి వేడుకలు నందికొట్కూరు నియోజకవర్గ వ్యాప్తంగా వైభవంగా జరిగాయి. తెల్లవారుజామునే పుణ్యస్నానాలాచరించి శ్రీకృష్ణుని చిత్రపటాలకు పూజలు నిర్వహించుకున్నారు. స్వామి వారి చిత్రపటాలతో ఊరేగింపు నిర్వహించారు. కన్నయ్య, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించారు. గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా మాయలు చాలయ్యా, గోపికమ్మా నిను విడలేమ్మా తదితర పాటలకు చిన్నారుల నృత్యాలు, సాయంత్రం గ్రామాల్లో ఉట్లు కొట్టే కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. – నందికొట్కూరు



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం



పగిడ్యాలలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మిడుతూరులో ఉట్టి కొడుతున్న యువకుడు

నందికొట్కూరులో శ్రీ కృష్ణుడి జన్మాష్టమి వేడుకల ముగింపు కార్యక్రమం ఆచార్య ప్రబోధానంద ఆశ్రమంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపిక శ్రీకృష్ణుని జననం, శ్రీకృష్ణుని లీలలు తదితర వేషధారణలు రక్తి కట్టించారు. నృత్య గానాలతో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు వాడాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ అనే గీతోపదేశంతో మానవాళికి దిశానిర్దేశం చేసింది శ్రీకృష్ణుడేనన్నారు. మహాభాగవతం కథలను విన్నా, దృశ్యాలను తిలకించినా జీవితానికి సరిపడా విలువలు బోధపడతాయన్నారు.

● మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరుతో పాటు పీరుసాహెబ్‌ పేట, రోళ్లపాడు, చెరుకుచెర్ల, తలముడిపి,పైపాలెం, కడుమూరు తరదితర గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, తదితర విశేష పూజలను వేదపండితులు సుబ్రమణ్యం శర్మ, అర్చకులు వెంకట్రామయ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు ఆలయానికి చేరుకొని స్వామివార్లకు ప్రీతికరమైన వెన్న, తీపి పదార్థాలతో కూడిన నైవేద్యంతో పాటు కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణంలో చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల వేషధారణలతో, యువత కోలాహలం మధ్య ఉట్టి కొట్టారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

● పగిడ్యాల: మండలంలోని పీకే ప్రాగటూరు, నెహ్రూనగర్‌, అర్లపాడు, వీరాపురం, పాత, కొత్త ముచ్చుమర్రి, కొత్త ఎల్లాల, వనములపాడు, సంకిరేణిపల్లె, బీరవోలు, పగిడ్యాల, కొత్త పాలమర్రి, లక్ష్మాపురం, తూర్పు, పడమర ప్రాతకోట, ఎం.ఎస్‌. ఘణపురం తదితర గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్టించి పురోహితుల చేత శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వియోగాలను పంపిణీ చేశారు. మంగళవారం శ్రీకృష్ణుని ఉత్సవ మూర్తి ఊరేగింపు ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

● జూపాడుబంగ్లా: శ్రీకృష్ణజన్మాష్టమిని తంగడంచ, జూపాడుబంగ్లా, తరిగోపుల, పారుమంచాల, తూడిచెర్ల, 80బన్నూరు, తాటిపాడు, తర్తూరు, భాస్కరాపురం, తదితర గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వైష్ణవాలయాలు, శ్రీకృష్ణుని చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి పిండివంటలతో నైవేద్యం సమర్పించారు. అర్చకకులు శ్రీకృష్ణుణి లీలలను కథలుగా భక్తులకు వినిపించారు.

● కొత్తపల్లి: మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. కొత్తపల్లి, గుమ్మడాపురం, తదితర గ్రామాలలో భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాయ కర్పూరం సమర్పించి, కుంకుమార్చన, పుష్పార్చన, అభిషేకాలతో, యువతులు, మహిళలు ఉపావాసాలతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాలలో పెద్దలు, యువకులు ఉట్టికొట్టి వేడుకలు జరుపుకున్నారు. కొత్తపల్లి గ్రామంలో రాధాకృష్ణాలయంలో రాధాకృష్ణుల ఉత్సవ మూర్తులకు కళ్యాణ నిర్వహించారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు: ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఏపీఎస్‌ఆర్టీసీ డిపోలో రెండు నూతన బస్సు సర్వీసులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికుల ఇబ్బందులు గమనించి రెండు సర్వీసులను ప్రారంభించామన్నారు. బస్టాండులో తాగునీరు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం మహేంద్రుడు, ఆర్టీసీ సీఐ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు. కాగా గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జవహర్‌నాయక్‌, సిద్ధాపురం, ఎస్‌ఎన్‌ తండా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేను కలిసి సిద్ధాపురం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ అధికారులకు ఎన్నోసార్లు వినతి పత్రం అందించినా స్పందించడం ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే డీఎంకు ఫోన్‌ చేసి బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

117, 128 జీఓలు రద్దు చేయాలి

● వెలుగోడు: విద్యా వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిన 117, 128 జీఓలను రద్దు చేయాలని ఏపీ టీఎఫ్‌ జిల్లా అధ్యక్షులు ఎం రామచంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.వి.శివయ్య తదితరులు సోమవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

విగ్రహ ప్రతిష్ట పూజలు ప్రారంభం



స్వామి వార్ల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

కొత్తపల్లి: మండల పరిధిలోని జి.వీరాపురం గ్రామంలో చెన్నకేశవ, వీరాంజనేయ, లింగమయ్య స్వామి విగ్రహాల ప్రతిష్ట పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే స్వామివారికి గణపతి పూజ, విశ్వక్సేన ఆరాధన, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, భగవత్‌ పుణ్యాహవాచనం, దీక్షాసూత్రధారణ, కేతకబంధన, అగ్ని ప్రతిష్టా, సర్వతోభద్రయంత్ర తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం మాతృసంగ్రహణం, దేవతా జలాధివాసం, మహామంగళ హారతీ తదితర విశేష పూజలు గ్రామ పెద్దల సమక్షంలో అర్చకులు నిర్వహించారు.

కుమారస్వామికి విశేషపూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్‌: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో కృతికా నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామి వారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు.

కొలువుదీరిన మౌలాలి స్వామి పీర్లు


కొత్తపల్లి: మండల కేంద్రంలో సోమవారం మౌలాలి స్వామి పీర్లు కొలువుదీరాయి. భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈనెల 29న పెద్ద సరిగెత్తు, 30న చిన్న సరిగెత్తు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

నెహ్రూనగర్‌ శివపై కేసు నమోదు

నందికొట్కూరు: నాగటూరు జంబులమ్మ ఆలయ పూజారి తలారి దేవమ్మపై దాడి చేసి బంగారు గొలుసు లాక్కునేందుకు ప్రయత్నించిన నెహ్రూనగర్‌ శివపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం హెడ్‌ కానిస్టేబుల్‌ మాధవస్వామి తెలిపిన వివరాలు.. ఆలయంలో ఒంటరిగా పూజలు చేస్తున్న పూజారి దేవమ్మను గమనించిన శివ దాడి చేసి మెడలోని బంగారు గొలుసును లాగేందుకు యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో పూజారి కుమారుడు ఈశ్వరయ్య అక్కడకు చేరుకుని శివను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించాడు. నిందిడిని అరెస్ట్‌ కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్‌ తెలిపారు.

ప్రసన్న స్వరూపుడు గణపతి

● సామవేదం షణ్ముఖశర్మ



ప్రవచనాన్ని వినిపిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

శ్రీశైలంటెంపుల్‌: గణపతి ప్రసన్న స్వరూపుడని, త్వరగా అనుగ్రహిస్తాడు కాబట్టి ఈ స్వామిని క్షిప్రప్రసాద గణపతి అంటారని ప్రవచకులు సామవేదం షణ్ముఖశర్మ తెలిపారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ నిర్వహిస్తున్న గణపతి గాథలు ప్రవచనం సోమవారం మూడో రోజుకు చేరింది. ముందుగా ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం ప్రవచకులు తన ప్రవచనాన్ని వినిపిస్తూ.. పరమేశ్వరుడికి త్రిపురాసుర సంహారం సమయంలో వచ్చిన విఘ్నాలను తీర్చి హేరంబ గణపతిగా పిలవబడ్డారని పురాణాలు చెబుతున్నాయన్నారు. గణేశ పురాణంలో గణపతికి దుర్వాయుగ్మపూజ విశేషంగా చెప్పబడిందని, కేవలం గణపతి నామాన్ని జపించినంతనే ఆయన అనుగ్రహిస్తాడన్నారు. తణపతి అవతారాలలో నర్తన గణపతి రూపం ఎంతో విశేష అవతారమని, ఈ గణపతినే నృత్య గణపతిగా ఆరాధిస్తున్నామన్నారు. శ్రీశైల సంబంధిత గణపతి గాథలను, క్షేత్ర వైభవాన్ని సనాతనధర్మం, వైదిక ఆచారాలకు సంబంధించిన పలు అంశాలను వివరించారు.

నాలుగోసారీ నవ్వులపాలేనా?

- ఇప్పటికే మూడు సార్లు వాయిదా పడిన పగిడ్యాల జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నిక
- నేడు నాలుగోసారి ఎన్నిక నిర్వహణకు అధికారులు సిద్ధం

పగిడ్యాల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు రాజకీయ రంగు పులుపుకుంది. ఈ ఎన్నికల్లో ఆధిపత్యం కోసం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, ఎంపీ బైరెడ్డి శబరి వర్గీయులు పోటీపడుతున్నారు. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల కమిటీలకు ఈనెల 8న ఎన్నికలు జరిగినా పగిడ్యాల జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాల కమిటీ ఎన్నిక మాత్రం వాయిదా పడుతూ వస్తోంది. మండలంలో 20 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 4 జిల్లా పరిషత్‌, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ బాలికల గురుకుల పాఠశాలలు ఉన్నాయి. అత్యధిక చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌ పదువులను ఏకగ్రీవంగా చేసుకోవాలని ఎమ్మెల్యే వర్గీయులు ఆశించారు. తామేమీ తక్కువ కాదన్నట్లు పోటీకి సై అంటూ ఎంపీ వర్గీయులు తెర పైకి వచ్చారు. ఈక్రమంలో అధికార పార్టీలోని ఎమ్మెల్యే, ఎంపీ వర్గీయులే ప్రధాన ప్రత్యుర్థులుగా మారి వారి అనైక్యతను బహిర్గతం చేసుకున్నారు. ఫలితంగా మండలంలో ఆదర్శ పాఠశాల, పగిడ్యాల జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాలల్లో మొదట కోరం లేక వాయిదా పడ్డాయి. ఈనెల 17న ఆదర్శ పాఠశాల చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌ను ఏకగ్రీవంగా చేసుకోవడంలో ఎమ్మెల్యే వర్గీయులు సఫలీకృతులు కాగా జెడ్పీ పాఠశాలలో మాత్రం ఏకగ్రీవానికి ఎంపీ వర్గీయులు ససేమిరా అన్నారు. మూడోసారి ఈనెల 24న చేపట్టాలని యత్నించినా 50 శాతం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. ఇప్పుడు నాలుగోసారి మంగళవారం నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈసారైనా నవ్వుల పాటు కాకుండా ఎన్నిక సజావుగా జరగాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.